బాలికా విద్యపై బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ విడుదల చేస్తున్న సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ సరిత, ఆనందేశీ, వేనుబాబు, యమున

జియాగూడ: బాలికలను విద్యావంతులను చేస్తే వారు అన్ని రంగాల్లో రాణి స్తారని రూమ్ టూ రీడ్ సీనియర్ ఆఫీసర్ సరిత, ప్రతినిధి యమున అన్నారు. గురువారం సబ్జిమండి అంగన్‌వాడీ కేంద్రంలో రూమ్ టూ రీడ్ ఇండియన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి అడుగు మా అమ్మాయితోనే అందరం కలిసి మార్పు తెద్దాం, బాలిక విద్యా ప్రచార కార్యక్రమం బ్రోచర్‌ను గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఆనందేశి వేణుబాబుతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....కొమార్లు మార్పు తెచ్చే దిశగా.. అన్న నినాదంతో 15 రోజుల పాటు బస్తీ సంఘం సభ్యుల సహకారంతో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంవత్సరం ఆరు దేశాలకు చెందిన ఆరుగురు బాలికల జీవితంలో చదువు వల్ల జరిగిన మార్పుపై వీడియో డాక్యుమెంటరీ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మన దేశానికి చెందిన యాషిక అనే బాలిక కరాటేలో రాణించిందని తెలిపారు.

కనుల పండువగా జ్వాలా తోరణం



తులసీ నారాయణుల కల్యాణం



జ్వాలా తోరణం కింది నుంచి భక్తుల ప్రదక్షిణ

లంగర్‌హౌస్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని తులసీ లక్ష్మి నారాయణుల వివాహ మహోత్సవం కనులపండువగా జరిగింది. లంగర్‌హౌస్ త్రివేణి సంగం వద్ద వెలసిన చారిత్రాత్మక మఠదేవాలయం జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో కార్తీక ముక్తిస్నానాల జాతర నిర్వహించారు. ఇందులో భాగంగా పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వేదపండితులు రాజనర్సిహ్మా చారి చేతుల మీదుగా బుధవారం తులసీ లక్ష్మీ నారాయణుల కల్యాణం నిర్వహించారు. అనంతరం కల్యాణ తులసీ లక్ష్మీనారాయణులను పల్లకీలో జ్వాలాతోరణం కింది నుంచి ఊరేగించారు. రాంలీలా మైదానంలో వెలిగించిన జ్వాలాతోరణం కింద నుండి స్వామివార్లతో పాటు భక్తులు ప్రదక్షిణలు చేశారు.

వికసిత్ భారత్‌లో సహకార సంఘాల పాత్ర కీలకం



మాట్లాడుతున్న అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు

గన్‌ఫౌండ్రీ: వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు అన్నారు. గురువారం అబిడ్స్‌లోని అపెక్స్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో 71వ జాతీయ సహకార వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... సహకార సంఘాల కృషిని ప్రోత్సహిస్తూ వాటి అభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషించడానికి ఈ వేదిక దోహదపడుతుందన్నారు. ఔత్సాహికతను పెంపొందిస్తూ సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడం, జీవనోపాధిని సృష్టించడం ద్వారా సహకార సంస్థలు మెరుగైన భవిష్యత్తును నిర్మిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అపెక్స్ బ్యాంక్ సీజీఎం టి.జ్యోతి, జీఎంలు కేఎల్.సురేఖ, ఎంఆర్. శ్రీనివాసరావు, పి.సుజాతలతో పాటు ఇతర బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ఇంద్రాణి మహా విద్యాలయ్‌లో..



శాంతినగర్ శ్లోకా ది స్కూల్‌లో..

జియాగూడ: దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను పురస్కరించుకుని గురువారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డోర్‌బస్తీలోని ఇంద్రాణి మహా విద్యాలయ్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు స్కూల్ కరస్పాండెంట్ మిథిలేష్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఓడి ఇంద్రాణి, ఇన్‌చార్జ్ శ్వేతా తదితరులు పాల్గొన్నారు. శాంతినగర్‌లోని శ్లోకా ది స్కూల్‌లో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో చిన్నారి విద్యార్థులు వేషాధారణలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్, రతన్ ప్రకాష్ జైస్వాల్, తిరుమల రావు, అన్వేష్, అమితా చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బుజ్జం జానకీరామ్ మృతి తీరని లోటు



బుజ్జం జానకీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి, సంఘ సేవకులు, గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భారత మాత, కోట మైసమ్మ దేవాలయం సలహాదారు బుజ్జం జానకీరామ్ మృతి తీరని లోటని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, అన్నారు. గురువారం గౌలిపురా సారస్వత అకాడమీ పాఠశాలలో నిర్వహించిన సంతాప సభలో వివిధ పార్టీల నాయకులు జానకీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జానకీరామ్ మృతి పాతబస్తీకి తీరని లోటని, పాత నగరంలో ఏ కార్యక్రమం జరిగినా ఆయన తప్పనిసరిగా పాల్గొనేవారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆలే భాస్కర్ రాజ్, ప్రతినిధులు ఎస్.మల్లేషం గౌడ్, ఆదర్ల మహేశ్, ఆకుల శ్రీరాములు, కె.ఎస్.ఆనంద్ రావు, మామిడి కృష్ణ, మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు, దేవాలయ కమిటీ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

అబిడ్స్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.రాజాసింగ్ అన్నారు. గురువారం ధూల్‌పేట్‌లోని రిలయన్స్ హైటెక్ స్కూల్‌లో క్రీడల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ.... ధూల్‌పేట ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా పేద బడుగు వర్గాల విద్యార్థులకు రిలయన్స్ హైటెక్ స్కూల్ ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తూ విద్యారంగ వ్యాప్తికి కృషి చేస్తుందన్నారు. బాలల దినోత్సవం రోజు విద్యార్థులు క్రీడా పోటీల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల కార్యదర్శి, విద్యావేత్త జితేందర్ సింగ్ మాట్లాడుతూ.... తమ విద్యాసంస్థల్లో విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, ఇతర రంగాల్లో కూడా విద్యార్థులు రాణించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మెట్టు సాయికుమార్, కార్పొరేటర్లు లాల్‌సింగ్, శశికళ కృష్ణ, మాజీ కార్పొరేటర్లు ముఖేష్ సింగ్, పరమేశ్వరీ సింగ్, అనిల్ సింగ్, బీజేపీ గోషామహల్ నియోజకవర్గ కన్వీనర్ ఎం.కృష్ణ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, జితేందర్ సింగ్

పేరు ఘనం.. వసతులు శూన్యం

- గోల్కొండ కోట వద్ద కనీస సౌకర్యాలు కరువు
- పర్యాటకుల అవస్థలు
- పార్కింగ్ సౌకర్యం లేక ట్రాఫిక్ సమస్యలు
- క్యాంటిన్ సదుపాయం లేక రోడ్డుపైనే భోజనాలు



విద్యుత్ దీపాల వెలుగులో గోల్కొండ కోట



కోట ముందు రోడ్డు పక్కన భోజనం చేస్తున్న పర్యాటకులు

గోల్కొండ: ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోటకు నిత్యం దేశవిదేశాల నుంచి వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. దేశంలోనే ప్రముఖమైన కోటల్లో గోల్కొండ కోటకు ప్రత్యేక గుర్తింపు ఉంది. హైదరాబాద్‌కు వచ్చే టూరిస్టులు ఎవరైనా ముందుగా సందర్శించేది గోల్కొండ కోటకు మాత్రమే. 500 ఏళ్ల నాటి నిర్మాణ శైలికి గోల్కొండ కోట నిలువెత్తు నిదర్శనం. భారీ గోడలు, పటిష్టమైన ప్రహరీ, గోల్కొండ కోటకు ప్రత్యేక ఆకర్షణ. కోటలో క్లాపింగ్ పోర్టిపో శతాబ్దాల క్రితం నాటి సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనం. కోటలోని ప్రవేశద్వారం, రాణీమహల్ ప్రాంగణం తదితర ప్రాంతాల్లోని భారీ ఫిరంగులను పర్యాటకులు కళ్లప్పగించి చూస్తారు. అంతేకాకుండా కుతుబ్ షాహీ రాజులు వాడిన వివిధ రకాల ఆయుధాలను కోటలోని ఆయుధాగారంలో ప్రదర్శనకు ఉంచారు. అక్కన్నమాదన్న కార్యాలయం, భక్త రామదాసును బంధించిన చెరసాల, కోటకు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. అయితే ఇవన్నీ తిలకించడానికి పర్యాటకులకు కనీసం నాలుగు గంటల సమయం పడుతుంది. కోటలో కేంద్ర పురాతత్వ శాఖ ఏర్పాటు చేసిన క్యాంటిన్‌లో వాటర్ బాటిళ్లు, ఐస్‌క్రీం తప్ప ఇంకేమి లభించవు. దీంతో అలసిపోయిన పర్యాటకులు భోజనం కోసం మెహిదీపట్నం, అబిడ్స్, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. కోటలో పర్యాటకులకు నీళ్ల బాటిళ్లు, ఆహార పదార్థాలను తీసుకెళ్లేందుకు అనుమతి లేదు. కోట బయట ఉన్న ఒకే ఒక్క రెస్టారెంట్ నాన్ వెజ్ పదార్థాలను మాత్రమే అందుబాటులో ఉండటంతో వెజిటేరియన్‌లు భోజనం దొరక్క ఇబ్బందులు పడుతున్నారు.

పార్కింగ్ లేక అవస్థలు..

మరో వైపు ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారు ఎక్కువగా టూరిస్టు బస్సులు, కార్లల్లోనే వస్తుంటారు. ప్రతినిత్యం కోటకు సుమారు 250–350 వరకు కార్లు వస్తుంటాయి. అదే విధంగా పదుల సంఖ్యలో టూరిస్టు బస్సులు కూడా వస్తుంటాయి. అయితే కోట అధికారులు మాత్రం వీరికి పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకుల వాహనాలకు పార్కింగ్ ప్రదేశం కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే విధంగా కోటలో నాణ్యమైన భోజనం అందించేందుకు క్యాంటిన్ ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని టీజీఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ బీవీకే మూర్తి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందన్నారు. మెహిదీపట్నం పరిసరాల కాలనీలు, సంక్షేమ సంఘాలు మెహిదీపట్నం దగ్గరలో ఉన్న వివిధ కళాశాలల నిర్వాహకులు, విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా తమను సంప్రదించవచ్చునని తెలిపారు. ప్రయాణికుల సూచనలు, సలహాలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 9959226133 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు శ్రీవారికి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10 గంటలకు సామూహిక రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నామన్నారు. సాయంత్రం 6 గంటలకు లక్ష్మీనారాయణ పూజ, దీపాలంకరణ సేవ, ఈశాన్య భాగంలో అరటి డొప్పలు, ఆవు నెయ్యితో దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భార్యపై దాడి కేసులో నిందితుడికి రెండు నెలల జైలు



నిందితుడు మహ్మద్ ఖలీల్

గౌలిపురా: భార్యపై దాడికి పాల్పడిన వ్యక్తికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ నాంపల్లి కోర్టు స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఉమాపతి రావు గురువారం తీర్పు ఇచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాకుత్‌పురా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖలీల్ (34) ఇటీవల భార్యపై దాడికి పాల్పడటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ– పెట్టి కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం నిందితుడిని నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా కేసు పూర్వ పరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఇద్దరు రౌడీషీటర్లకు జైలు శిక్ష



సయ్యద్ ఇబ్రహీం అలీ　మహ్మద్ యూనుస్ ఖాన్

గౌలిపురా: గంజాయి సేవిస్తున్న ఇద్దరు రౌడీ షీటర్లను గురువారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా స్పెషల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ డీసీ ఉమాపతి రావు వారికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. డబీర్‌పురా కోమటివాడి ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ సయ్యద్ ఇబ్రహీం అలీ, యాకుత్‌పురా చావునీ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మహ్మద్ యూనుస్ ఖాన్ ఇటీవల భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి గురువారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ నిందితులకు రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి వేడుకలు



నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: దివంగత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురాకుల కృష్ణ మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి బాటలు వేసిన ఘనత నెహ్రూకు దక్కుతుందన్నారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. షేక్‌పేట్‌లో కాంగ్రెస్ నాయకుడు డి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించారు.

దయార్ద్ర హృదయులను అభినందించాలి



డాక్టర్ ప్రకాష్‌కు అవార్డు అందజేస్తున్న బుర్రా వెంకటేశం తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రపంచవ్యాప్తంగా ఉన్న దయార్ద్ర హృదయులను అభినందించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం రవీంద్రభారతిలో జేసీఐ అలుమిన్ క్లబ్ జోన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి అవార్డులను అందజేశారు. గత 50 ఏళ్లుగా సామాజిక, వైద్య రంగంలో సేవలందిస్తున్న డాక్టర్ ప్రకాష్‌రామ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ క్లబ్ జోన్ చైర్మన్ జీవీఎస్.రాజు, కార్యదర్శి గుప్తాజోన్, వైస్ చైర్మన్ రేణు అగర్వాల్ పాల్గొన్నారు.

సింగరేణి నాణ్యతకు కేరాఫ్‌గా నిలవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి ఉద్యోగులు

నాంపల్లి: నాణ్యమైన సేవలు అందించే సంస్థలకు మంచి గుర్తింపు, మనుగడ ఉంటుందని, ఈ నేపథ్యంలో నాణ్యతకు సింగరేణిని చిరునామాగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని డైరెక్టర్ (పీఅండ్‌పీ పర్సనల్) జి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బొగ్గు నాణ్యతా వారోత్సవాల్లో భాగంగా గురువారం రెడ్‌హిల్స్‌లోని సింగరేణి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్వాలిటీ పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తిలో నాణ్యత లోపిస్తే కోట్ల రూపాయల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, తద్వారా వినియోగదారులను కోల్పోతామన్నారు. అందుకే నాణ్యత విషయంలో ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. జనరల్ మేనేజర్ (కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం. సుభానీ మాట్లాడుతూ... నాణ్యత ఆవశ్యకతపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించడానికి నాణ్యతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవలం బొగ్గు ఉత్పత్తే కాకుండా సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి తన వృత్తి జీవితంలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనిచేయాలని సూచించారు. అనంతరం ఉద్యోగులందరూ నాణ్యత ప్రతిజ్ఞ చేశారు. సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, సివిల్ జీఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిపుణులతో ముఖాముఖి



సాక్షి,సిటీబ్యూరో: అనురాగ్ హ్యూమన్ సర్వీసెస్ మేథో వికలాంగుల శిక్షణా కేంద్రంలో బాలల దినోత్సవం సందర్భంగా గురువారం వీ–గార్డ్ నవదర్శన్ ప్రాజెక్ట్ సిబ్బందితో విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియో థెరపిస్ట్‌లు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు వివిధ అంశాలపై మాట్లాడారు. కంప్యూటర్ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు డుప్కి పున్నమి జాతర



ముస్తాబైన రథం

లంగర్‌హౌస్: డుప్కి పున్నమి కార్తీక ముక్తి స్నానాల జాతరకు త్రివేణి సంగమం ముస్తాబయ్యింది. కార్తీక పౌర్ణమి రోజున లంగర్‌హౌస్ త్రివేణి సంగమానికి మారువేశంలో వచ్చిన రామలక్ష్మణులు పౌర్ణమి రోజు సంగమంలో స్నానాలు ఆచరించి భక్తరామదాసును చెర నుండి విడిపించారు. ఈ నేపథ్యంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా ఇక్కడ నదీ స్నానాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా లంగర్‌హౌస్ పుర వీధుల్లో వైభవంగా రథోత్సవం నిర్వహించనున్నారు. ఇప్పటికే ముక్తి స్నానాలు ఆచరించేందుకుకి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఉత్తరాది రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. పీఠాధిపతి 1008 రాహుల్ దాస్ బాబా ఆధ్వర్యంలో ముక్తిస్నానాల జాతర నిర్వహించనున్నారు.

దేశాభివృద్ధికి పునాదులు వేసిన దార్శనికుడు నెహ్రూ



నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గౌలిపురా: దేశాభివృద్ధికి పునాదులు వేసిన దార్శనికుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చార్మినార్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి వెంకటేశ్ అన్నారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం లాల్‌దర్వాజా మోడ్‌లోని నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రిటీష్ పాలకుల కబంధ హస్తాల నుంచి దేశానికి విముక్తి కలిగించారని, తొలి ప్రధానిగా దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేశ్ బాబు, అముల్, బజరంగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం





శివాజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారుల సందడి



స్మార్ట్ కిడ్స్ స్కూల్‌లో చిన్నారి అనుపురం హ్రితిక్ సందేశ్

గోల్కొండ: బాలల దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఆడిపాడుతూ సందడి చేశారు. గుడిమల్కాపూర్, కార్వాన్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

మేరు కులస్తులకు రుణాలు మంజూరు చేయాలి



నూతి శ్రీకాంత్ గౌడ్‌తో మేరు సంఘం నాయకులు

గౌలిపురా: చేతి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేరు కులస్తులను బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు వారు రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర మేరు సంఘం నాయకులు వెంకటేశ్, కీర్తి రాజ్ గోపాల్, దీకొండ నరసింగ రావు, ఎస్.బి.సంగేవార్, మాడిశెట్టి లక్ష్మీనారాయణ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో సుమారు 10 లక్షలకు పైగా ఉన్న మేరు కులస్తులు కులవృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో జీవనం కొనసాగిస్తున్నారని వారందరికి బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు టైలర్ షాప్‌లు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.